VISION BHARATH REPORTER
విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారే" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్,
MOBILE:
9494498787,9440232308.

# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి
అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 02-07-2024 సంపుటి : 06 సంచిక : 285 పేజీలు : 8 వెల : రూ 3-00

# ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

కొత్త ప్రభుత్వంలో పెన్షన్లతో కార్యక్రమాలకు శ్రీకారం
ఎన్టీఆర్ స్ఫూర్తితోనే పనిచేస్తున్నాం
పెనుమాకలో పెన్షన్ల పంపిణీ చేపట్టిన సిఎం చంద్రబాబు





అమరావతి,.జూలై1: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమని ఎపి సిఎం చంద్రబాబు అన్నారు. వారి జీవన ప్రమాణాల పెంపునకు మొదటి అడుగుపడిందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. సోమవారం ఉదయమే ఆన నేరుగా పెన్షన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం మసీదు సెంటర్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్థులు, లబ్దిదారులతో ఆయన మాట్లాడారు. కొత్త ప్రభుత్వంలో మొదటగా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. అందరి ఆశీస్సులతో నాలుగోసారి సిఎంగా ప్రమాణం చేశానన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమమన్నారు. వారి జీవన ప్రమాణాల పెంపులో మొదటి అడుగు పడిందన్నారు. సమాజమే దేవాలయం అని ప్రజలే దేవుళ్లు అని ఎన్టీఆర్ చెప్పారనీ, ఆయన స్ఫూర్తితో తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పేదలపై శ్రద్ధ పెడతామన్నారు. అనునిత్యం వినూత్నంగా ఆలోచిస్తామన్నారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం చూడాలన్నదే తన ఆలోచన అన్నారు. దివ్యాంగులకు పింఛను రూ.6వేలు చేశామని, వారికి చేయూతనివ్వడం సమాజం బాధ్యత. నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. గత పాలకులు, అధికారులు సచివాలయ సిబ్బందితో పింఛన్ల పింపిణీ తమ వల్ల కాదన్నారు. పంపిణీ చేతకాకపోతే ఇంటికి వెళ్లాలని వారికి ఆనాడే చెప్పానన్నారు. నేడు 1.25 లక్షల మంది సచివాలయ సిబ్బందితో పంపిణీ జరుగుతోందన్నారు. దీనికి వాలంటీర్ల సహాయం కూడా తీసుకోవాలని చెప్పామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే రోజు ఐదు సంతకాలు పెట్టానన్నారు. మొదటిది మెగా డీఎస్సీ.. వీలైనంత త్వరగా టీచర్ల నియామకం చేపట్టే బాధ్యత తీసుకుంటానన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేశానన్నారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై మూడోది పెట్టానన్నారు. రూ.5 కే భోజనం చేయొచ్చునన్నారు. త్వరలోనే 183 క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వానికి శక్తి వస్తే ప్రజలకు మరింత తిరిగి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. తమది ప్రజా ప్రభుత్వం.. నిరంతరం వారికోసం పనిచేస్తాం అని అన్నారు. ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి ప్రభుత్వానికి సహకరించాలని చంద్రబాబు కోరారు. తవ్వుతున్న కొద్దీ గత ప్రభుత్వ తప్పులు, అప్పులే కనబడుతున్నాయి. గతంలో ప్రజల బతుకులను రివర్స్ చేశారు.. కోలుకుని మళ్లీ ముందుకు వెళ్లాలి. అందరం సమష్టిగా కలిసి పనిచేద్దాం. సంపద సృష్టించి ఆదాయం పెంచుతాం.. పెంచిన దాన్ని పంచుతాం. మీ అందరి అభిమానం చూరగొని లోకేశ్ ఇక్కడి నుంచి పోటీ చేశారు. మంగళగిరిలో 90 వేలకు పైగా మెజారిటీతో ఆయన్ను గెలిపించారు. వైసిపి నేతలు ఐదేళ్ల పాటు ప్రజలను అణగదొక్కారు. పెట్టుబడులు పెట్టేందుకు భయపడే పరిస్థితి కల్పించారని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో పెన్షన్ల కోసం ఇప్పటివరకూ రూ. 1,939 కోట్లు ఖర్చు చేసేవారని.. ఇప్పుడు అదనంగా మరో రూ.819 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. పెనుమాక గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ వేదికపై సీఎం చంద్రబాబు కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు. ఎస్టీ వాడల్లో పర్యటించానని బనావత్ రాములుకు వృద్ధాప్య పెన్షన్, అయన కుమార్తె సాయికు వితంతు ఫించన్ రూ.7 వేలు అందించానని చెప్పారు.

## మళ్లీ 1995 నాటి సిఎంను చూస్తారు

తనతో పాటు అధికారులు కూడా పరుగెత్తాల్సిందే
పెన్షన్ల పంపిణీలో సిఎం చంద్రబాబు వ్యాఖ్యలు



అమరావతి,జూలై1(: మళ్లీ 1995 నాటి సిఎంను చూస్తారని, పాలనలో వేగంగా దూసుకుపోతానని సిఎం చంద్రబాబు అన్నారు. తన ఆలోచనలకు అనుగుణంగా అధికారులు కూడా మారాలని అన్నారు. పెనుమాక సభలో మాట్లాడుతూ ప్రజల సంఓేమం లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని అన్నారు. గతంలో పరదాల సీఎంను మనం చూశామని.. ఇప్పుడు ప్రజల ముఖ్యమంత్రిని చూస్తున్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్, చంద్రబాబు మధ్య సరదా సంభాషణ జరిగింది. అధికారులు సెట్ అయ్యేందుకు ఇంకా టైమ్ పడుతుందనుకుంటా సర్.. ఇంకా పరదాలు కడుతున్నారు అని లోకేశ్ అనగానే.. లేదు సెట్ అయ్యారని చంద్రబాబు బదులిచ్చారు. కొంతమంది ఇంకా పరదాలు కట్టడం మానుకోలేదని.. బతిమిలాడి తీయిస్తున్నామని లోకేశ్ చెప్పారు. మళ్లీ అలాంటివి పునరావృతమైతే పరదాలు కట్టినవారిని సస్పెండ్ చేయడం తప్ప వేరే మార్గం ఉండదని సీఎం అన్నారు. ఎవరైనా సరే పాత రోజులు మరిచిపోవాలి. ఫిర్యాదులు వస్తే మాత్రం చర్యలు తప్పవు. రివర్స్ పోయే బండిని పాజిటివ్ వైపు నడిపిస్తున్నాం. స్పీడ్ పెంచడం తప్ప వెనక్కి వెళ్లే పరిస్థితి ఎవరికీ ఉండకూడదు. ఆ ఆలోచనే రాకూడదు. అలా ఉండకపోతే ఒక్క షాక్ ట్రీట్‌మెంట్ ఇస్తే అందరూ సెట్ అయిపోతారు. దానికి నేను సిద్ధంగా ఉన్నా. ప్రారంభం కాబట్టి స్లోగా వెళ్తున్నా.. ఇక స్పీడ్ పెంచాలి. ఈ ప్రభుత్వంలో 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తారు. చరిత్ర గుర్తు పెట్టుకోవాలి. నువ్వు కూడా అప్పట్లో కుర్రాడివి. నీకు కూడా ఐడియా లేదు.

## పెన్షన్ల పంపిణీలో చేతివాటం

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

పల్నాడు,జూలై1(: ఏపీలో ఊరూవాడా పెన్షన్ల పంపిణీతో ఓవైపు పండగ వాతావరణం నెలకొంటే.. మరోవైపు పెన్షన్ల విషయంలో ఓ సచివాలయ ఉద్యోగి చేసిన నిర్వాకంతో అంతా అవాక్కవ్వాల్సి వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సోమవారం నుంచి పెన్షన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఉదయం నుంచి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లను పంపిణీ చేసారు. అయితే పల్నాడు జిల్లాలో మాచర్లలో మాత్రం పెన్షన్ల పంపిణీలో సచివాలయ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించారు. మాచర్ల 9వ వార్డు సచివాలయం వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ మూడావత్ వాలు నాయక్ పెన్షన్‌దారుల వద్ద నుంచి కమిషన్ పేరుతో రూ.500 మేరకు వసూలు చేశాడు. విషయం తెలిసిన మున్సిపల్ కమిషన్.. సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకున్నారు. పెన్షన్ల పంపిణీలో కమిషన్ తీసుకున్నందుకు గాను వాలు నాయక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మాచర్ల మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు.

## నీట్ పరీక్షను రద్దు చేయాల్సిందే

రాజ్‌భవన్‌ను ముట్టడించిన విద్యార్థి సంఘాలు

హైదరాబాద్,జూలై1: విద్యార్థి, యువజన సంఘాల నేతల రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఎన్టీఏను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన ఐక్య కమిటీ ఆధ్వర్యంలో గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అయితే అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు గవర్నర్ నిరాకరించడంతో రాజ్‌భవన్ ముట్టడికి నేతలు బయలు దేరారు. పీపుల్స్ ప్లాజా నుంచి రాజభవన్ వరకు ర్యాలీగా బయలుదేరిన విద్యార్థి సంఘాల నేతలను ఐమ్యాక్స్ సర్కిల్ వద్ద ఉన్న ఇందిరా గాంధీ విగ్రహం వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే వారిని గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌కు తరలించారు. రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ సహా ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, వీజేఎస్, ఏఐపీఎస్‌యూ, పీవైసీ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, వైజేఎస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ పరీక్షలు రద్దు చేయకుండా మౌనంగా ఉండడం దుర్మార్గమని మండిపడ్డారు. గత 20 రోజుల నుంచి నీట్ విద్యార్థుల పక్షాన అన్ని సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా 70 వేలకు పైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారన్నారు. అపాయింట్‌మెంట్ అడిగినా కిషన్ రెడి స్పందించకపోవడంతో ఆయన ఇంటిని ముట్టడించామని తెలిపారు. స్టూడెంట్ మార్చ్ నిర్వహించామని.. సిగ్నిచర్ కాంపెయిన్ చేశామ నిన్న ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేశామని చెప్పారు. గవర్నర్‌కు నీట్ విద్యార్థుల పక్షాన రిప్రెసెంటేషన్ ఇవ్వడానికి అపాయింట్‌మెంట్ కోరితే ఇవ్వలేదని.. అందుకే రాజ్‌భవన్ ముట్టడికి బయలుదేరమని వెల్లడించారు.

# వలంటీర్లు లేకుంటే పెన్షన్లు రావని దుష్ప్రచారం

అవినీతి లేకుండా పెంచిన పెన్షన్లు ఇస్తున్నాం
మనకోసం కాకుండా...భవిష్యత్ తరాల కోసం పనిచేస్తా
నిధులు లేకపోవడంతో జీతం తీసుకోవద్దనుకుంటున్నా
గొల్లప్రోలులో పెన్షన్ల పంపిణీ చేపట్టిన డిప్యూటి సిఎం పవన్




పిఠాపురం,జూలై1: వలంటీర్లు లేకుంటే పెన్షన్లు రావని ప్రచారం చేశారని, కానీ అది అబద్ధమని ఇప్పుడు తాము రుజువు చేశామని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో పెన్షన్లలో కొంత లంచానికి పోయేదని ఇప్పుడా బాధ లేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అంతా సిఎవ చంద్రబాబు ఆదేశాలతో రంగంలోకి దిగి, పెన్షన్ల పంపిణీ చేపట్టారని అన్నారు. తాను పూర్తి జీతం తీసుకుని పని చేద్దామనుకున్నానని.. కానీ పంచాయతీ రాజ్ శాఖలో నిధుల్లేవు. ఎన్ని రూ.వేల కోట్ల అప్పులు ఉన్నాయో తెలియడం లేదని అందుకే జీతం వదిలేస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఒక్కో విభాగం తవ్వే కొద్దీ లోపలికి వెళ్తూనే ఉంది. ఇవన్నీ సరిచేయాలి. శాఖ అప్పుల్లో ఉన్నప్పుడు నాలాంటివాడు జీతం తీసుకోవడం చాలా తప్పు అనిపించింది. అందుకే జీతం వదిలేస్తున్నాను అని చెప్పా. దేశం కోసం నేల కోసం పని చేస్తా అని స్పష్టం చేశారు. మన పిల్లల భవిష్యత్ కోసం పని చేద్దామని, తను నిజాయితీగా పని చేస్తాని హామీ ఇచ్చారు. ఇకపోతే వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోమవారం పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. లబ్దిదారులకు పెన్షన్లు అందజేసారు. పవన్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాజమండ్రి ఎయిర్ పోర్టుకు చేరుకుని.. అక్కడి నుంచి గొల్లప్రోలుకు బయలుదేరి వచ్చారు. భారీ మెజారిటీతో గెలిపించిన పిఠాపురం ప్రజలకు రుణపడి ఉంటానని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. శాఖలపై అధ్యయనానికి కొంత సమయం తీసుకున్నా. తక్కువ చెప్పి ఎక్కువ పని చేయాలనుకుంటున్నా. అధికారంలోకి వచ్చాక పింఛన్లు పెంచి ఇచ్చామే తప్ప తగ్గించలేదు. రాష్ట్రానికి సంక్షేమంతో పాటు అభివృద్ధి కావాలి.గత ప్రభుత్వంలో పంచాయతీ నిధులు ఎటు వెళ్లాయో తెలియట్లేదు. వందలకోట్ల రూపాయలతో రుషికొండలో ప్యాలెస్ కట్టుకున్నారు. అవే నిధులు ఉపయోగిస్తే కొంత అభివృద్ధి జరిగేది. నా వైపు నుంచి ఎలాంటి అవినీతి ఉండదు. పర్యావరణ శాఖను బలోపేతం చేస్తాం. గోదావరి పారుతున్నా తాగునీటికి ఇబ్బందులున్నాయి. గతంలో జల్‌జీవన్ మిషన్ నిధులున్నా ఉపయోగించలేదు. కనీసం మ్యాచింగ్ గ్రాంట్లు కూడా ఇవ్వలేదు. క్యాంపు ఆఫీస్‌లో మరమ్మతుల గురించి అధికారులు అడిగితే ప్రస్తుతానికి ఏమీ చేయొద్దని చెప్పా. అవసరమైతే కొత్త ఫర్నిచర్ నేనే తెచ్చుకుంటానని తెలిపాను. సచివాలయం నుంచి సిబ్బంది వచ్చి వేతనాలకు సంబంధించిన పత్రాలపై సంతకాలు పెట్టమంటే నాకు మనస్కరించలేదు. జీతం తీసుకుని పనిచేద్దామనుకున్నా.. కానీ పంచాయతీ రాజ్ శాఖలో నిధుల్లేవు. ఎన్ని వేలకోట్ల రూపాయల అప్పులు ఉన్నాయో తెలియడం లేదు.

## ఏపీలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే బాధేస్తుంది : మాజీ మంత్రి బొత్స

అమరావతి : చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 రోజుల నుంచి ఏపీలో జరుగుతున్న పరిణామాలు



చూస్తుంటే బాధేస్తుందని మాజీ మంత్రి బొత్స, వైసీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలకు చెందిన పార్టీ కార్యాలయాలు( నాయకులపై దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.గతంలో ఎప్పుడూ లేనివిధంగా పార్టీ కార్యాలయాల్లోకి అధికార పార్టీ ఎమ్మెల్యేలు వెళ్లి పరిశీలించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల నుంచి ఏదేని పొరపాట్లు జరిగితే నోటీసులు ఇవ్వాలని అన్నారు . వర్సిటీల్లో వీసీలను తొలగించాలని దౌర్జన్యాలకు దిగడం తప్పని అన్నారు. విద్యాశాఖలో నాపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసుకోవచ్చని కూటమి ప్రభుత్వానికి సూచించారు మూడువారాల్లోనే పదివేల కోట్లు అప్పు : వైసీపీ నాయకులు రవిచంద్రారెడ్డిసంపద సృష్టిస్తామన్న చంద్రబాబు మూడు వారాల్లోనే పదివేల కోట్ల రూపాయల అప్పులు చేశారని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి కె. రవిచంద్రారెడ్డి ఆరోపించారు.

## అమర జవాన్లకు పరిహారం ఇవ్వాలి.. చంద్రబాబు ప్రభుత్వానికి జగన్ విజ్ఞప్తి

ఇటీవల లడఖ్‌లో శిక్షణలో భాగంగా యుద్ధ ట్యాంకుతో నదిని దాటే విన్యాసాలను చేస్తున్న సమయంలో అకస్మికంగా వరదలు సంభవించాయి. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు వీరమరణం పొందిన విషయం తెలిసిందే. ఇందులో ఏపీకి చెందిన ముగ్గురు జవాన్లు ఉన్నారు. ఈ ఘటనపై ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. దేశ రక్షణ కోసం జవాన్ల త్యాగాలు మరువలేనివన్నారు. మరణించిన జవాన్లలో కృష్ణా జిల్లాకు చెందిన సాదరబోయిన నాగరాజు, ప్రకాశం జిల్లాకు చెందిన ముత్తుమల రామకృష్ణారెడ్డి, బాపట్ల జిల్లాకు చెందిన సుభాన్ ఖాన్ ఉండడం బాధాకరమన్నారు. ప్రాణాలు కోల్పోయిన జవాన్లకు నివాళులర్పిస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శిక్షణ సమయంలో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని చంద్రబాబు సర్కారుకు సూచించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు.

# సంపాదకీయం

మంగళవారం 02-07-2024

## సత్వర న్యాయం..చట్టాల లక్ష్యం కావాలి !

బాధితులకు న్యాయం చేయడంతో పాటు..సత్వర న్యాయం మన చట్టాల లక్ష్యం కావాలి. పాలకులు వారి అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటున్న చట్టాలను కూడా చర్చించాలి. చట్టం ఎవరికైనా ఒక్కటే అన్న భావన ప్రజల్లో రావాలి. రాజకీయ నాయకులు చట్టాల నుంచి తప్పించుకోకుండా కఠిన చర్యలు తీసు కోవాలి. ఆ మేరకు చట్టాల అమలులో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి. ఉదాహరణకు అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పుడు పనులకు సంబంధించి విచారణలు వేగవంత కావాలి. బ్రిటిష్ కాలం నాటి చట్టాలను పూర్తిగా సంస్కరించి భారతదేశానికి అనుగుణంగా చట్టాల రూపకల్పన జరగాలి. ఐపిసి, సిఆర్‌పిసిల స్థానంలో కొత్తగా తీసుకుని వచ్చిన చట్టాలను స్వాగతించాల్సిందే. ఓ రకంగా చెప్పాలంటే భారత న్యాయ వ్యవస్థలో నూతన అధ్యాయానికి తెరలేచింది. మన దేశంలో బ్రిటిష్ వలస పాలన నుంచి కొనసాగుతున్న భారత శిక్షా స్మృతి(ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ), భారత సాక్ష్యాధార చట్టం కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో గతేడాది పార్లమెంటు ఆమోదించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్(బీఎస్ఏ) ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు, ఎస్సెమ్మెస్ లాంటి ఎలక్ట్రానిక్ మాధ్యమాలతో సమన్ల జారీ లాంటి అత్యాధునిక పద్ధతులు కొత్త చట్టాలతో న్యాయవ్యవస్థలోకి వచ్చాయి.. వీటిని తేవడంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, భారతీయుల కోసం భారతీయులు ఈ చట్టాలను రూపొందించారు. దీంతో ఇక వలస పాలన నాటి నేర న్యాయచట్టాలు శాశ్వతంగా కనుమరుగుకానున్నాయి. కొత్త చట్టాల ఆత్మ, శరీరం, స్ఫూర్తి అంతా భారతీయమేనని తెలిపారు. ఈ కొత్త చట్టాల ప్రకారం.. క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా కచ్చితంగా తీర్పు వెలువడాలి. ఇందుకు అనుగుణంగా ఖచ్చితంగా పనిచేయాల్సి ఉంటుంది. తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. వ్యవస్థీకృత నేరాలను, ఉగ్రచర్యల ను కొత్త చట్టాల్లో స్పష్టంగా నిర్వచించారు. రాజద్రోహం అనే పదాన్ని తొలగించారు. అయితే దేశ సార్వభౌమత్వం, సమగ్రతలకు భంగం కలిగించే చర్యలను శిక్షార్హం చేశారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల కోసం కొత్త అధ్యాయాన్ని చేర్చారు. కొత్త చట్టాల ప్రకారం.. చిన్నారులపై సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష లేదా యావజ్జీవశిక్ష పడనుంది. రద్దయిన ఐపీఎస్‌లో కొన్ని సెక్షన్లు సంక్లిష్టంగా ఉండేవి. ఏ నేరం ఏ సెక్షన్ కిందకు వస్తుందన్న విషయంలో కాస్త గందరగోళం ఉండేది. వాటిని ప్రస్తుతం సరళతరం చేశారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో ఆ సంఖ్యను 358కి కుదించారు. ఐపీసీలోని 6 నుంచి 52 సెక్షన్ల మధ్య ఉన్న పలు నిర్వచనాలను ఒక సెక్షన్ కిందకు తెచ్చారు. 18 సెక్షన్లను ఇప్పటికే రద్దు చేశారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడం, చిన్నారులపై సామూహిక అత్యాచారం, మూకదాడి తదితర నేరాలకు ఐపీసీలో ప్రత్యేకంగా సెక్షన్లు లేవు. దీంతో గందరగోళం ఏర్పడేది. భారతీయ న్యాయ సంహితలో ఆ లోటును పూడ్చారు. ఇందుకు సంబంధించి చట్టాలను రూపొందించారు. క్రిమినల్ కేసుల్లో దర్యాప్తు మరింత పకడ్బందీగా జరగడానికి వీలుగా తీవ్రమైన నేరాల్లో సాక్ష్యాల సేకరణకు ఫోరెన్సిక్ నిపుణులు సంఘటన స్థలాన్ని సందర్శించడాన్ని తప్పనిసరి చేశారు. దాదాపు 150 ఏళ్లుగా అమలులో ఉన్నచట్టాలకు పాతరేయడం ఓ మంచి పరిణామంగా చేయాలి. ఇందుకు అనుగుణంగా పోలీసులు, న్యాయస్థానాలను కూడ ఆసన్నద్ధం చేయాలి. ఇప్పటికే అనేక దశలుగా పోలీస్‌లకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. కంప్యూటర్ వ్యవస్థలో అవసరమైన మార్పులు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా దర్యాప్తు, న్యాయవిచారణ చేసేందుకు కొత్త చట్టాలు ఊతమిస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. 14 రోజుల్లోగా దర్యాప్తు చేపట్టి కేసును కొలిక్కి తేవాలన్న ప్రాథమిక లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. మహిళలపై కొన్ని నేరాలకు సంబంధించి బాధితురాలి వాంగ్మూలా న్ని మహిళా మేజిస్ట్రేట్ ముందు నమోదు చేయాల్సి ఉంటుంది. వారు లేని పక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి. బాధితులతోపాటు నిందితులు కూడా ఎఫ్ఐఆర్ నకళ్లను ఉచితంగా పొందే వీలుంటుంది. వీటితోపాటు పోలీస్ రిపోర్టు, ఛార్జిషీటు, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లోగా పొందవచ్చని కొత్త చట్టం పేర్కొంటోంది. ఇదే క్రమంలో కేసు విచారణలో అనవసర జాప్యాన్ని నివారించడానికి, సకాలంలో న్యాయం అందేలా చేయడానికి, న్యాయస్థానాలు కూడా గరిష్ఠంగా రెండు వాయిదాలు మాత్రమే మంజూరు చేస్తాయి.సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకుని, సాక్షుల రక్షణ పథకాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తప్పని సరిగా అమలు చేయాల్సి ఉంటుంది. అత్యాచార నేరాల కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీస్‌లు నమోదు చేయాల్సి ఉంటుంది. మహిళలు,దివ్యాంగులు,దీర్ఘకాల వ్యాధిగ్రస్తులతో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసు వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం నుంచి మినహాయింపు ఉంటుంది. వారు తాము నివాసం ఉన్న చోటే పోలీస్‌ల సాయం పొందవచ్చు. స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్థులకు సమాజ సేవచేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి. ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు, నేరం ద్వారా సంక్రమించిన సొమ్ముతో వారు కొన్న స్థిర, చరాస్తులనూ జప్తు చేసే అధికారం పోలీస్‌లకు ఉంటుంది. సాక్షుల వాంగ్మూలాలు, ఆడియో, వీడియో సాక్షాలన్నింటినీ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన డిజి లాకర్‌లో భద్ర పరుస్తారు. క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం (సీసీటీఎన్ఎస్) ద్వారా ఇప్పటికే దేశ వ్యాప్తంగా అన్నిపోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేసినందున , సాక్షాలను ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. డిజి లాకర్‌ను ఇంటర్ ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టం (ఐసీజేఎస్) కు అనుసంధానం చేస్తారు. పోలీస్‌లు, న్యాయవాదులు, న్యాయమూర్తులు అవసరమైనప్పుడు సాక్షాలను పరిశీలించుకోవచ్చు. దీని వల్ల ఆధారాలు మాయం చేయడం సాధ్యం కాదు. పాత చట్టాల కింద నమోదైన కొన్ని కేసులు నెలల తరబడి దర్యాప్తు, కొన్నేళ్ల పాటు విచారణ జరిగే అవకాశం ఉంది.

## అవ్వ తాతల ముఖంలో చిరునవ్వును చూడడమే మా లక్ష్యం.

### - ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వరరెడ్డి వెల్లడి..



ఎమ్మిగనూరు జూలై 1 విభారె న్యూస్..01-07-2024న తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉమ్మడి ఎన్డీఏ ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో భాగంగా అవ్వా తాతల మొహంలో చిరునవ్వులు చూడాలి అనే ఉద్దేశంతో పెంచిన పెన్షన్ లను ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసన సభ్యులు డా బి వి జయనాగేశ్వర రెడ్డి స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని వివిధ వార్డుల యందు పర్యటించి ఆయా వార్డులలో గల పెన్షన్ లబ్దిదారులకు (వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు 3000 రూపాయల నుండి 4000 రూపాయలు) (దీనితో పాటు ఏప్రిల్ నెల 1000, మే నెల 1000, జూన్ నెల 1000 మొత్తం 7000 రూపాయలు), దివ్యంగుల పెన్షన్ 3000 నుండి 6000 వేల రూపాయలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు 5000 నుండి 15000 వేల రూపాయలు, కిడ్నీ, కాలేయం,గుండె మార్పిడి చేయించుకున్న వారికి 5000 రూపాయల నుండి 10000 రూపాయలు పెంచిన పెన్షన్ లబ్దిదారులకు వారి ఇళ్ల దగ్గరికి వెళ్లి పెన్షన్ పంపిణి చేయడం జరిగినది.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం 104 వినతులు

### ---జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పద్మజ అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు



మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న ఈ కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సీరియస్ గా తీసుకొని నిర్ణీత కాలపరిధిలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. తమ పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ సమస్యలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. బడ్జెట్ తో కూడిన సమస్యల మినహా పరిష్కరించదగ్గ సమస్యలను ఏ మాత్రం జాప్యం చేయకుండా వెంటనే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిష్కారం కాని సమస్యలకు సవివరమైన కారణాలు తెలుపుతూ ఎండార్స్మెంట్ ఇచ్చి విశదీకరించాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి దరఖాస్తులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని జేసీ సూచించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 104 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## జిల్లా పోలీసులకు 52"ప్రజా ఫిర్యాదుల---

### జిల్లా ఎస్పీ. కె.రఘువీర్ రెడ్డి---





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఫిర్యాదిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ గారు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" కార్యాక్రమంలో సివిల్ తగాదాలు,కుటుంబ కలహాలు,అన్నదమ్ముల ఆస్థి పంపకాలలో మనస్పర్ధలు మొదలగునవి ఉన్నాయి.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర,వేంకటేశ్వర రావు ,సూర్యమౌళి ,ఎస్పీ సీసీ నాగరాజు , పాల్గొన్నారు.

## పెన్షన్ల పంపిణీలో సాంకేతిక లోపం

### పలుచోట్ల మొరాయించిన సర్వర్లు

అమరావతి,జూలై1(: రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్లు పంపిణీలో సాంకేతిక లోపం తలెత్తింది. సర్వర్‌లో సాంకేతిక లోపంతో పలుచోట్ల పెన్షన్ల పంపిణీ ఆగిపోయింది. సర్వర్ లోపంపై అధికారులు ఆరా తీస్తున్నారు. టెక్నికల్ విభాగంలో ఇంకా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు పని చేస్తున్నారు. అయితే ఇదంతా మానవ తప్పిదమా... లేక సాంకేతిక లోపమా అన్న అంశంపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. కావాలని చేశారా అన్న అంశంపై అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. ఇక అధికారులు గంటన్నర సేపు ప్రయాస పడి సర్వర్ లోపాన్ని తొలగించి పెన్షన్లు తిరిగి పంపిణీ చేస్తున్నారు. మరోవైపు ఎన్టీఆర్ జిల్లాలోనూ.. సర్వర్ స్లో అవడంతో పింఛన్ల పంపిణీకి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. పింఛన్లు పంపిణీ చేసే ఉద్యోగి లాగిన్ అవ్వాలన్నా... పింఛను పొందే వ్యక్తి వేలిముద్ర వేయాలన్నా సర్వర్ పని చేస్తేనే పంపిణీ జరుగుతుంది. ఉదయం 6 గంటల నుంచి ఏడు గంటల వరకూ 200 పైగా పింఛన్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకూ మూడు లేదా నాలుగు పింఛన్లు మాత్రమే పంపిణీ చేయడం జరిగింది.

## మాజీ ఎంపి నందిగం సోదరుడి అరెస్ట్

### ఇసుక అక్రమంగా తరలిస్తుండగా కేసు

గుంటూరు,జూలై1(: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ సోదరుడు ప్రభుదాస్ అరెస్ట్ అయ్యారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న కేసులో సురేష్ సోదరుడు ప్రభుదాసు అరెస్ట్ అయ్యారు. రాత్రి ఉద్ధండరాయునిపాలెం నుంచి విజయవాడకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల విచారణలో అవి నందిగం ప్రభుదాస్‌కు చెందిన ఇసుక లారీలుగా గుర్తించడం జరిగింది. నందిగం ప్రభుదాస్‌ను తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. రెండు లారీలు, కారును స్వాధీనం చేసుకున్నారు.

## విభారె వార్త కు స్పందించిన అధికారులు







--- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01- -పట్టణంలో పద్మావతి నగర్ డివైడర్ స్తంభం వద్ద కాలేజీపబ్లిసిటీ కోసం బోర్డు తగిలించారు. ఆబోర్డు వచ్చే వాహనాలు డివైడర్ పక్కగా వెళితే వాహనంలోకి దూసుకుపోయే ప్రమాదం పొంచి ఉందని శనివారం రోజు విభారె న్యూస్ పత్రిక లో ప్రచురణ చేసారు . వార్త చూచిన టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి వెంటనే స్పందించి అక్కడ ఉన్న బోర్డును సిబ్బంది తో తొలగించారు. వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

## భాష్యం స్కూల్లో డాక్టర్స్ డే వేడుకలు...



ఎమ్మిగనూరు జూలై 1 విభారె న్యూస్..పట్టణములోని భాష్యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సోమవారం ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాచాని కవిత మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే.. డాక్టర్ పునర్జన్మ నిస్తాడని అన్నారు. ఆపదలో ఉన్న మనిషికి డాక్టర్ వైద్యం అందించి పునర్జన్మ నిస్తాడని అందుకే డాక్టర్లను వైద్యోనారాయన హరి అంటరాని చెప్పారు.. కనిపెంచిన తల్లిదండ్రులు, విద్యా. బుద్ధి నేర్పిన గురువులు తరువాత దేవుడితో డాక్టర్ సమానం అని తెలిపారు.. అందుకే ప్రతి ఒక్కరు డాక్టర్లను గౌరవించాలని ఆమె అన్నారు. అనంతరం భాష్యం స్కూల్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్ లోని డాక్టర్లకు పుష్పగుచ్చానిచ్చి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ తో పాటు చాంప్స్ ఇంచార్జి అనురాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణి చేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - నిరుపేద, బడుగు వర్గాలకు భరోసా కల్పించడమే



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయం అని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు.సోమవారం నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రి, కొత్త ముచ్చుమర్రి, వనములపాడు, కొణిదేల గ్రామాల్లో వృద్దులు, వితంతు, దివ్యాంగులు, తదితర లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి చేశారు.ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పేదల ప్రభుత్వం ఏర్పడిందని, అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బిజెపి సంకిర్ణ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమాన దృష్టితో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని బైరెడ్డి అన్నారు.

## మొదటి రోజు పింఛన్ల పంపిణీ 93.73 శాతం

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - పట్టణంలో 44 సచివాలయాల పరిధిలో సోమవారం సాయంత్రానికి 93-73 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జూలై మిగతా వారికి రేండో తేదీన పంపిణీ చేస్తామని తెలిపారు.



# భర్తకు మూడో పెళ్లి చేసిన భార్యలు

కాకినాడ, జూలై 1, భార్యనే మోయడం కష్టం అనుకుంటున్నార ఇప్పటి జనరేషన్‌లో కొందరు కుర్రాఇద్దరు భార్యలు.. కానీ అల్లూరి జిల్లాలో అయితే ఇద్దరు భార్యలతో ఎంచక్కా సంసారం సాగించే ఓ భర్త.. ఇప్పుడు ముచ్చటగా మూడో భార్యను పెళ్లి చేసుకున్నాడు. అది కూడా అఫీషియల్‌గానే.. అందుకు అప్పటికే ఉన్న ఇద్దరు భార్యలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. అంతేనా.. వారిద్దరూ పెళ్లి పెద్దల్లా మారి అన్ని తామై చూసుకున్నారు. హ్యాపీగా బంధుమిత్రులను ఆహ్వానించారు. మా భర్తకు మూడో పెళ్లికి అందరూ వచ్చి ఆశీర్వదించాలని శుభలేఖలు కూడా పంచారు. మీ నిండు మనసుతో ఆశీర్వదించి మా ఆతిథ్యం స్వీకరించ ప్రార్థన అంటూ ప్రతి ఒక్కరి గడపకు వెళ్లి? పెళ్లి కార్డు ఇచ్చి మరి ఆహ్వానం పలికారు. ఇంతకీ ఇద్దరి భార్యల సమ్మతితో మూడో భార్యను సొంతం చేసుకున్న ఆ లక్కీయస్ట్ ఫెలో ఎవరో తెలుసుకోవాలని మీకు ఉందా.. పదండి డీటేల్స్‌లోకి వెళ్తాం.అది అల్లూరి జిల్లా ఏజెన్సీలోని పెదబయలు మండలం గుల్లెలు పంచాయితీ కించూరు గ్రామం. అక్కడ సాగేని పండన్న.. పార్వతమ్మను తొలుత వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు అప్పలమ్మను కూడా మొదటి భార్య అంగీకారంతో పెళ్లాడాడు. అలా ఇద్దరు భార్యలతో పండన్న సంసార జీవితం సాఫీగానే సాగిపోతుంది. ఏనాడు ఎటువంటి కుటుంబ కలహాలు లేకుం..డా ఆ ఇద్దరు భార్యలు భర్తను చక్కగా చూసుకుంటున్నారు. అయితే.. అప్పటికే ఇద్దరు భార్యలు ఉన్న పండన్న.. లక్ష్మి అనే మరో యువతిపై మనసు పారేసుకున్నాడు. ఆమెది జి మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ బందవీధి గ్రామం. లక్ష్మిని ఇష్టపడ్డ విషయం .. తనను ఎంతగా ప్రేమించే ఇద్దరు భార్యలకు చెప్పాడు. దీంతో తన భర్త ఆనందంలో తమ ఆనందం చూసుకునే ఆ ఇద్దరు భార్యలు పండన్నను ప్రోత్సహించారు.దీంతో ఇక పండన్న వెనక్కి తగ్గలేదు. ఎలాగైనా ఆమెను వివాహం చేసుకొని తమ జీవితంలోకి ఆహ్వానించాలని అనుకున్నాడు. అంతే.. ఆ ఇద్దరు భార్యలతో రాయభారం పంపాడు. పెద్దలు కూడా అంగీకరించడంతో.. లక్ష్మిని పండన్నకు ఇచ్చి వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇక.. ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు.పండన్నకు తల్లిదండ్రులు లేరు.. దీంతో ఇద్దరు భార్యలే అతనికి సర్వస్వం. వాళ్లు కూడా అదే స్థాయిలో పండన్నను ప్రాణానికి మించి చూసుకుంటున్నారు. ఇక పెళ్లి పెద్దలు కూడా వాళ్లిద్దరే అయ్యారు. శుభలేఖల్లో కూడా.. ఆ ఇద్దరు భార్యలే అందరిని ఆహ్వానిస్తున్నట్టు ముద్రించారు. ఇంటింటికి వెళ్లి శుభలేఖలను పంచారు. బంధుమిత్రులను ఆహ్వానించారు. 'తల్లిదండ్రులు లేని పండన్న ఇద్దరు భార్యలే సర్వస్వం అయ్యి పెళ్లి పెద్దలుగా దగ్గరుండి వివాహం జరిపించారు. శుభలేఖల్లో సైతం వారి పేర్లే వేసి అందరినీ ఆహ్వానిస్తున్నట్లుగా ముద్రించారు. 'మీ రాకను ప్రేమతో ఆహ్వానిస్తూ.. నిండు మనసుతో ఆశీర్వదించి మా ఆతిథ్యం స్వీకరించ ప్రార్థన. ఆహ్వానితులు సాగేని పార్వతమ్మ, సాగేని అప్పలమ్మ' అంటూ ఇంటింటికీ వెళ్లి పెళ్లి పత్రికలు అందించి ఆహ్వానించారు. ఈ నెల 25న ఉదయం 10 గంటలకు కించూరులో వివాహం జరిగింది. పండన్న బంధు మిత్రులు, గ్రామ పెద్దలు అంతా కూడా ఈ వివాహానికి హాజరయ్యారు. ఈ పెళ్లి పత్రిక, పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. నెటిజన్లు లక్కీయెస్ట్ వ్యక్తి అంటూ కామెంట్స్ చేస్తున్నారు.మీ రాకను ప్రేమతో ఆహ్వానిస్తూ.. నిండు మనసుతో ఆశీర్వదించి మా ఆతిథ్యం స్వీకరించ ప్రార్థన.. అంటూ ఆ ఇద్దరు భార్యలు సాగేని పార్వతమ్మ, సాగేని అప్పలమ్మ..' అంటూ శుభలేఖను ముద్రించి ముగించారు.జూన్ 25 ఉదయం 10 గంటలకు కించూరులో వివాహం జరిగింది. నవవధువు లక్ష్మి తరపు బంధువులు, మూడో పెళ్లి చేసుకుంటున్న పండన్న బంధుమిత్రులు, గ్రామ పెద్దలు కూడా వివాహానికి హాజరయ్యారు. అదే స్థాయిలో విందు కూడా ఏర్పాటు చేశారు. అందరూ కలిసి గ్రాండ్‌గా పండన్న లక్ష్మిల వివాహాన్ని జరిపించారు. సంసారం సుఖసంతోషాలతో సాగిపోవాలని ఆశీర్వదించారు. ఇదండీ ఇద్దరు భార్యల చేతుల మీదుగా ముచ్చటగా మూడో పెళ్లి చేసుకున్ పండన్న వివాహ వేడుక విశేషాలు. నిజంగా ఎంత లక్కీ యెస్ట్ ఫెల్లో గురూ నువ్వు అంటూ కామెంట్స్ పెడుతన్నారు ఈ విషయం తెలిసిన నెటిజన్లు.

# దళారీలకు చెక్...

తిరుపతి, జూలై 1,తిరుమల శ్రీవారి దర్శనం కోసం దేశనలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దళారీలు మోసాలకు పాల్పడుతున్నాయి. తిరుమలలో దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు టీటీడీ కసరత్తు చేస్తుంది. టీటీడీ ఆన్ లైన్ అప్లికేషన్లను ఆధార్ తో అనుసంధానం చేసేందుకు కసరత్తు చేస్తుంది. శ్రీవారి దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ, ఇతర సేవలను భక్తులు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునేందుకు టీటీడీ వీలు కల్పిస్తుంది. టీటీడీ వెబ్‌సైట్‌లో దళారీ బెడదను నియంత్రించేందుకు ఆధార్ లింక్ చేసే సాధ్యాసాధ్యాలపై టీటీడీ పరిశీలిస్తుంది. అప్లికేషన్లకు ఆధార్ లింకు చేసే అంశాలపై జఎఆంఎ అధికారులు టీటీడీకి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.టీటీడీ ఈవో జె.శ్యామలరావు దళారీ వ్యవస్థను నియంత్రించే అంశమై యూఐడీఏఐ అధికారులతో చర్చించారు. దళారుల బెడద తప్పించేందుకు టీటీడీ అప్లికేషన్లను ఆధార్ తో లింక్ చేసే విషయమై దృష్టిసారించారు. ఇందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని టీటీడీ ఐటీ విభాగం అధికారులను ఈవో ఆదేశించారు. ఆధార్ ద్వారా భక్తుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్‌తో పాటుగా ఆధార్ డూప్లికేషన్ ఎలా కనిపెట్టాలో జఎఆంఎ అధికారులతో టీటీడీ ఈవో చర్చించారు.తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదాలు మరింత రుచిగా, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఈవో కార్యాలయంలో టీటీడీ అధికారులు, డెయిరీ నిపుణులతో ఈవో శ్యామలరావు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఈవో మాట్లాడుతూ... నాణ్యమైన నెయ్యి కొనుగోలు, కొనుగోలు చేసిన నెయ్యిని ప్రస్తుతం పరీక్షిస్తున్న విధంగా కాకుండా మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలా పరీక్షించాలనే అంశాలపై చర్చించారు. ప్రముఖ డెయిరీ నిపుణులు విజయభాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ్ లడ్డు నాణ్యత పెంచేందుకు ఎస్ఎస్ఐ నిబంధనల ప్రకారం నెయ్యి తయారీ, అగ్ మార్క, ఫుడ్ సేఫ్టీ అథారిటీ, టీటీడీ నిబంధనల ప్రకారం నెయ్యి నాణ్యత ఎలా ఉండాలనేదానిపై ప్రజెంటేషన్ వివరించారు. లడ్డు నాణ్యత మరింత పెంచడానికి అవసరమైన నెయ్యి కోసం సమగ్ర నివేదిక ఇవ్వాలనీ ఈవో ఆదేశించారు.తిరుమల వచ్చే భక్తులకు దుకాణదారులు అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై టీటీడీ ఈవో శ్యామలరావు ఇటీవల స్పందించారు. శ్రీవారి దర్శనార్థం విచ్చేసి భక్తులకు టీటీడీ నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో జె శ్యామల రావు స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులకు కూడా పలు సూచనలు చేశారు. శ్రీనివాసమంగాపురం, శ్రీవారి మెట్టు మార్గంలో దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు కొంతమంది భక్తులు ఫిర్యాదు చేశారు. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు? జేఈఓ (విద్యా, వైద్యం) గౌతమి పర్యవేక్షణలో టీటీడీ ఎస్టేట్ అధికారి గుణ భూషణ్ రెడ్డి శ్రీవారి మెట్టు వద్ద ఉన్న మూడు షాపులను తనిఖీ చేశారు. ఇందులో షాప్ నంబర్-3లో వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. షాప్ నెంబర్ -3 యాజమానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రూ.25 వేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని టీటీడీ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపింది.

# బీహార్ దారిలో ఆంధ్రా నేతలు ..?

విజయవాడ, జూలై 1, ప్రత్యేకహోదా అంశానికి ఏపీ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయం ఉంది. 2014లో ఎన్డీఏ కూటమికి.. తర్వాత 2019లో జగన్ విజయానికి సహకరించింది. 2024కి వచ్చే సరికి ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికల అస్త్రం కాలేదు. జేడీ లక్ష్మినారాయణ లాంటి వాళ్లు సొంత పార్టీ పెట్టుకుని ప్రత్యేక హోదా నినాదం వినిపించినా ఆ బలం సరిపోలేదు. కాంగ్రెస్ పార్టీ తాము వస్తే మొదటి సంతకం హోదాపై పెడతామన్నా ప్రజలు లైట్ తీసుకున్నారు. కానీ ఎన్నికలు అయిపోయిన తర్వాత ఇప్పుడు ప్రత్యేకహోదా తెరపైకి కు వచ్చింది. కేంద్రంలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోంది. టీడీపీతో పాటు కింగ్ మేకర్‌గా బీహార్‌కు చెందిన జేడీయూ కూడా కీలకంగా ఉంది. ఆ పార్టీ బీహార్‌కు స్పెషల్ స్టేటస్ అడుగుతోంది. కానీ ఏపీలో టీడీపీ సైలెంట్‌గా ఉంటోంది. ఇప్పుడు ఇదే జగన్‌కు అస్త్రం అయ్యే అవకాశం కనిపిస్తోంది. అయితే జగన్ అందుకుంటారా లేదా అన్నదే కీలకం.. బీహార్ సీఎం నితీష్ కుమార్ బీహార్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ కేంద్రం ముందు ప్రతిపాదన పెట్టారు. ఈ ప్రతిపాదనకు జేడీయూ పార్టీ ఆమోదం తెలిపింది. నితీష్ కుమార్, ఆయన పార్టీ తమ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలతో పాటు యావత్ దేశ వ్యాప్తంగా రాజకీయ తుఫాను రేపారు. జేడీయూ డిమాండ్ చేస్తున్న ప్రత్యేక హోదా.. టీడీపీకి ఇబ్బంది కరమే. నిజానికి టీడీపీ ప్రత్యేకహోదా గురించి చెప్పలేదు. హోదా ఇవ్వలేదని కేంద్రం నుంచి బయటకు వచ్చి ఎన్డీఏకి వ్యతిరేకంగా పోటీ చేస్తే ప్రజలు ఆదరించలేదు. ఇటీవలి ఎన్నికల్లో హోదా ఇస్తామని కానీ..తెస్తామని కానీ ఎక్కడా చెప్పలేదు. అయితే నితీష్ కుమార్ కేంద్రంలో తమ పార్టీ మద్దతు అవసరం కాబట్టి ఆయన తరచూ హోదా ప్రస్తావన తెస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో చంద్రబాబు నాయుడు కీలకంగా మారినప్పుడు హోదాతోపాటు అమరావతి నిర్మాణానికి నిధులు వంటి కీలక విషయాలను షరతులుగా పెట్టి ఉంటారని అనుకున్నారు. అయితే బేషరతుగా మద్దతిస్తున్నామని రాష్ట్రానికి ఏం కావాలో అది తెచ్చుకుంటామని టీడీపీ చెబుతోంది. అయితే జగన్ మాత్రం.. ప్రత్యేకహోదా అడగకపోవడం పెద్ద పాపమని..తమ పార్టీ అంతర్గత సమావేశంలో వ్యాక్యానించారు. 2019 ఎన్నికల సమయంలో 25 మంది ఎంపీలను ఇవ్వండి కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని అన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రానికి మన అవసరం లేదని, వారే స్వయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలుగుతున్న కారణంగా ప్రత్యేక హోదాను డిమాండ్ చేయలేకున్నానని తన నిస్సహాయతను బహిరంగంగానే చెప్పారు. కానీ రాజ్యసభలో వైసీపీ సపోర్ట్ బీజేపీ చాలా ఇబ్బంది పడేది. అయితే ప్రతీ సారి బీజేపీకి మద్దతు ఇచ్చారు కానీ హోదాను డిమాండ్ చేయలేదు. ప్రత్యేక హోదా అంశం ఉపయోగించుకుంటే వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేతిలో వజ్రాయుధంలా మారే అవకాశం ఉంది. ప్రత్యేక హోదా అంశానికి ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తుందా లేదా అన్నది చెప్పడం కష్టం. ఎందుకంటే గతంలో ఈ హోదా పేరుతో అన్ని పార్టీలు ఓట్లు పొందాయి. ఎవరూ ఇవ్వలేదు .. తీసుకురాలేదు. హోదా విషయంలో ప్రజలు ఆసక్తి కోల్పోయారు.అందకే గత ఎన్నికల్లో కాంగ్రెస్ అన్నా..జేడీ లక్ష్మినారాయణ పోరాటం చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పైగా ఐదు వందల కోట్ల రూపాయలతో ప్యాలెస్ కట్టుకున్న జగన్.. రాష్ట్రానికి ప్రత్యేకహోదా అవసరమైని ఉద్యమం చేస్తే కా?స్త కామెడీ అవుతుంది. అయినా సరే ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ కు ప్రత్యేక ఆయుధం దొరికినట్లే అవుతుంది. జగన్ వెనుక ఉన్న కే?ల లగేజీ కావొచ్చు.. మరో అంశం కావొచ్చు ఎన్డీఏకి వ్యతిరేకంగా వెళ్లడానికి జగన్ సిద్దంగా లేరు. స్పీకర్ ఎన్నికలోనూ ఆయన ఏకపక్షంగా మద్దతు ప్రకటించారు. తర్వాత ఏదైనా అవసరం వచ్చినా ఆయన మద్దతిస్తారు. అలాంటిది ఇప్పుడు హోదా విషయంలో ఎన్డీఏను విలన్ ను చూసి ప్రజల్లోకి వెళ్తారా అన్నది పెద్ద ప్రశ్న.ఆయన బీజేపీని ఇరుకున పెట్టే పనులు ఇప్పడల్లా చేయలేరని..చేస్తే ఆయన రిస్క్ తీసుకున్నట్లేనని అంటున్నారు. అందుకే జగన్మోహన్ రెడ్డి అనివార్యంగా అందివచ్చిన అవకాశాన్ని వదులుకోక తప్పదని అంచనాకు వస్తున్నారు. మరి జగన్ ఈ అంచనాల్ని తలకిందులు చేస్తారా ? హోదా కోసం ఎన్డీఏపై యుద్ధం ప్రకటిస్తారా ?అయితే బీహార్ సీఎం తన రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించుకోవడానికే ఇలా రాజకీయం చేస్తున్నారన్న అభిప్రాయం ఉంది. బీహార్ తో పాటు ఏపీకి కూడా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తారని అంటున్నారు. అయితే ఇది ఏ రూపంలో చేస్తారన్నది మాత్రం క్లారిటీ లేదు. మరోసారి బీజేపీకి ప్రత్యేకహోదా మరకలు అంటించే ప్రయత్నం చేస్తే ఆ పార్టీ అగ్రనేతలు సహించే అవకాశం ఉండదన్న గుసగుసలు మాత్రం వినిపిస్తున్నాయి.

# గుంటూరులో కోహినూర్ వజ్రం..?

గుంటూరు, జూలై 1, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బెల్లంకొండ మండలం కోళ్లూరులో కోహినూర్ వజ్రం దొరికిందని చరిత్ర చెబుతోంది. నిజాం నవాబు కోహినూర్ వజ్రాన్ని చూసి కోయి నహీ నూర్ అన్నాడని అదే కోహినూర్ గా మారిందని చరిత్రకారులు పుస్తకాల్లో రాశారు. అయితే ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పులిచింతల ముంపులో మునిగిపోయింది. కోళ్లూరు తర్వాత అచ్చంపేట మండలం పుట్లగూడెంకు ఎక్కువ మంది వజ్రాల వేట కోసం వెళతారు. ఇక అటు, కృష్ణా జిల్లాలోని తీర ప్రాంతాల్లోనూ వేట సాగిస్తుంటారు.వేట షురూ.. తొలకరి జల్లులతో కొండ కోనల్లో వెదుకులాట ప్రారంభమైంది. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సద్ది మూటలతో కొండ బాట పడుతున్నారు. కోహినూర్ అంత కాకపోయిన, కనీసం పదో వంతు వజ్రమైనా తమ కంట పడకపోతుందా అని జల్లెడ పడుతున్నారు. వారికి వీరికి దొరికిందన్న మాట చెవిన పడగానే తిరునాళ్లకు వెళ్లినట్లు తరలి వెళ్తున్నారు మిగిలిన జనం.అదేమీ కృష్ణా నది తీర ప్రాంతమేమీ కాదు.. కోహినూర్ వజ్రం దొరికిన చోటు అంతకంటే కాదు. అయినా ఆ కొండను స్థానికులతో పాటు ఇతర ప్రాంత వాసులు జల్లెడ పడుతున్నారు. అది పల్నాడు జిల్లా నకరికల్లు మండలం శ్రీరాంపురం కొండ ప్రాంతం. పొద్దున్నే క్యారేజ్ లో అన్నం తీసుకుని మరీ మహిళలు ఆ కొండ ఎక్కుతున్నారు. ఉదయాన్నే ప్రారంభమయ్యే వేట సూర్యుడు అస్తమించే వరకూ కొనసాగుతోంది. ఇక్కడ కొండల్లో వజ్రాలు దొరుకుతున్నాయన్న వార్తలు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి.ఈ ముచ్చట ఇక్కడ.. అక్కడ.. అంతటికి పాకడంతో.. స్థానికులతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన ఆటోలు, బైక్‌ల్లో వచ్చి కొండపై వెదుకులాట ప్రారంభిస్తున్నారు. నకరికల్లు మండలంలోని గ్రామాల వాసులే కాకుండా పిడుగురాళ్ల, నర్సరావుపేట, సత్తెనపల్లి ప్రాంతాల నుండి కూడా వజ్రాల వేట కోసం వస్తున్నారు. కొంతమందికి వజ్రాలు దొరికాయన్న పుకార్లు షికారు చేస్తుండటంతో ఈ కొండకు వస్తున్న వారి సంఖ్య పెరిగిపోయింది. చేతిలో మట్టి తవ్వేందుకు చిన్న ఇనుప రాడ్డును పట్టుకుని గంటల కొద్దీ రాళ్లను ఏరుకుంటున్నారు. వాటిని తమ దగ్గర ఉన్న డబ్బాల్లో వేసుకుని తర్వాత వాటిని చెక్ చేయిస్తామని చెబుతున్నారు. పురుషుల కంటే మహిళలు అధిక సంఖ్యలో వస్తున్నారు.గత సీజన్ లో మాత్రం నకరికల్లు మండలం శ్రీరాంపురం వద్ద నున్న కొండపైకి వజ్రాల వేట కోసం వచ్చారు. దానికి కొనసాగింపుగా ఈ ఏడాది కూడా ఈ కొండ మీద పెద్ద సంఖ్యలో వజ్రాల వేట కొనసాగిస్తున్నారు. కొంతమేర రంగురాళ్లు దొరుకుతున్నాయన్న వాదన ఇక్కడికి వచ్చే వారి సంఖ్య పెరిగిపోతుంది. తొలకరి జల్లులతో ప్రారంభమయ్యే ఈ వేట మరో పది, పదిహేను రోజుల పాటు కొనసాగనుంది.

# భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలి

పరవాడ,భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం లంకెలపాలెం - పరవాడ రోడ్డుపై పరవాడ మండల ఆటో రిక్షా కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహిత 2023 పేరు మీద డిసెంబర్ 21వ తేదీన పార్లమెంటులో బిల్లుని ఆమోదించింది దానికి రాష్ట్రపతి డిసెంబర్ 25వ తేదీన ఆమోద ముద్ర వేశారు ఆ చట్టంలోని సెక్షన్ 106 (1) (2) ప్రకారం యాక్సిడెంట్ కేసులలో డ్రైవర్లకి 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష 10 లక్షల వరకు జరిమానా విధించబడుతుందని ఇది అత్యంత ప్రమాదకరమైనటువంటిది దీనిని అనకాపల్లి జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తున్నది. తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ల మీద తీవ్రమైనటువంటి అలజడి అసంతృప్తి ఆందోళనకి గురిచేస్తూ ఉన్నది అసలు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి కారణాలు ఏంటి అనేటటువంటి పరిశీలించకుండా ప్రమాదాల నివారించడానికి అవసరమైనటువంటి చర్యలు చేపట్టకుండా డ్రైవర్లది పూర్తి బాధ్యత చేయడం సరి కాదని గని శెట్టి అన్నారు. మోటార్ కార్మికులకు అండగా ఉండాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే వాళ్ల మీద ఎటువంటి చట్టాలు తీసుకొచ్చి జైల్లో పెట్టే విధంగా చట్టం చేయడం దుర్మార్గమని తక్షణమే ఈ చట్టాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళన పెద్ద ఎత్తున ఉదృతం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో లంకెలపాలెం ఆటో యూనియన్ నాయకులు ఎస్ గోవిందు, కే అప్పారావు, ఎన్ ముసిలి, డి మధు, వై నాగేష్, ఎస్ సన్యాసిరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# హోదా పై చంద్రబాబు మాట్లాడడంలేదు - వైఎస్ షర్మిలా రెడ్డి



విజయవాడ,బీహార్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని నితీష్ తీర్మానం చేసి మోడీ ముందట డిమాండ్ పెడితే, ఏపీకి హోదాపై చంద్రబాబు కనీసం నోరు విప్పడం లేదని ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. మోడీ సర్కార్ లో కింగ్ మేకర్ గా ఉన్న మీరు, హోదాపై ఎందుకు మౌనం వహిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి. రాజధాని లేని రాష్ట్రంగా బీహార్ కంటే వెనకబడి ఉన్నామని మీకు తెలియదా ? 15 ఏళ్లు హోదా కావాలని అడిగిన రోజులు మీకు గుర్తులేదా ? రాష్ట్ర అభివృద్ధిలో ఏపీ 20 ఏళ్లు వెనకబడిందని చెప్పింది మీరే కదా ? హోదా ఇవ్వకుంటే మద్దతు ఉపసంహరణ అని ఎందుకు అడగడం లేదు ? మోసం చేసిన మోడీతో హోదాపై సంతకం ఎందుకు పెట్టించలేరు ? ప్రత్యేక హోదాపై మీ వైఖరి ఏంటో చెప్పాలని, రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం దగ్గర హోదా డిమాండ్ పెట్టాలని, చంద్రబాబు ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

# జగన్ నెత్తిన పాలు పోసిన నితీష్

విజయవాడ, జూలై 1, వైఎస్ జగన్ ఓటమి బాధ నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారు. ఆయన బెంగళూరులోని తన ఇంట్లో ఉండి రెస్ట్ తీసుకుంటున్నారు. అయితే ఓటమిని పక్కన పెట్టి పార్టీని గాడిలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. మామూలుగా అయితే కార్యకర్తలను పరామర్శించడం పేరుతో ఆయన యాత్ర కూడాచేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తనకు పదకొండు స్థానాలు మాత్రమే వచ్చినా నలభై శాతం ఓట్లు రావడంతో ప్రజలు ఎక్కువ శాతం మంది తన వైపు చూశారని చెప్పుకోవడానికి వీలు కలిగింది. మూడు పార్టీలు కలిస్తే 56 శాతం ఓట్లు వస్తే, ఒంటరిగా పోటీ చేసి నలభై శాతం ఓట్లు తెచ్చుకోవడం ఆషామాషీ కాదని ఇప్పటికే వైసీపీ నేతలు ప్రచారాన్ని సోషల్ మీడియాలో ప్రారంభించారు. అయితే తాజాగా జరుగుతున్న ఘటనలు జగన్ కు అందివచ్చేటట్లే కనిపిస్తున్నాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పెట్టిన ఫిట్టింగ్ ఇప్పుడు జగన్ కు లాభం చేకూర్చేలా మారింది. బీహార్ అసెంబ్లీలో ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని నితీష్ కుమార్ తీర్మానం చేశారు. బీహార్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జేడీయూ తీర్మానం చేసింది. తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదంటే ప్రత్యేక ప్యాకేజీ కేంద్రం ఇచ్చేలా డిమాండ్ చేయాలని జాతీయ కార్యవర్గ సమావేశంలో నిర్ణయించింది. కాగా, జేడీయూ ప్రస్తుతం కేంద్రంలో ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉంది. దీన్ని ఉపయోగించుకొని రాష్ట్ర ప్రయోజనాల కోసం దీర్ఘకాలికంగా ఉన్న డిమాండ్ సాధనకు కృషి చేయాలని భావిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ఇటు జేడీయూ, అటు టీడీపీ మద్దతు కీలకం. జగన్ చెప్పింది కూడా అదే. 2019 ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఢిల్లీకి వెళ్లిన జగన్ తాము శాసించే స్థాయిలో బీజేపీకి సీట్లు వచ్చినప్పుడే ప్రత్యేక హోదా సాధ్యమని చెప్పారు. 2019 లో బీజేపీకి సొంత బలం ఉండటంతో అది సాధ్యం కాదని నాడే కుండబద్దలు కొట్టారు. అయితే ఇప్పుడు శాసించే స్థాయిలో ఉన్న చంద్రబాబు ప్రత్యేక హోదా తీసుకు రావడానికి ఎందుకు ప్రయత్నం చేయరని జగన్ జనంలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తు న్నాయి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే మద్దతు ఉపసంహరించాలని, తాము కూడా మద్దతు ఇవ్వమని చెబుతామని, అప్పుడు ప్రత్యేక హోదా వస్తుందని మెలిక పెట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే వీలయినంత త్వరలోనే ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయిం చుకున్నారని చెబుతున్నారు .ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇది నిజంగా ఇరకాటంలోకి నెట్టేదే. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. హోదా వస్తే పరిశ్రమలు వస్తా యని, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అందరూ అంగీకరిస్తారు. చంద్రబాబు కూడా2019 ఎన్నికలకు ముందు ధర్మపోరాటం పేరుతో ఇదే రకమైన డిమాండ్ తో దీక్షలు చేశారు. ఇప్పుడు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జగన్ కు ఒక ఊతమిచ్చినట్లయింది. బీహార్ కోరితే మనమెందుకు అడగమంటూ జగన్ జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవు తున్నారని తెలిసింది. ఇందుకోసం రోడ్ మ్యాప్ ను కూడా రూపొందిం చుకుంటున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. చంద్రబాబు మాత్రం ప్రస్తుతం రాష్ట్రం ఉన్న ఆర్థికపరిస్థితి, చేసిన వాగ్దానాల అమలుతో వాటిని సుసాధ్యంచేయడానికి నిధులు తెచ్చుకోవడం, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపైనే ఫోకస్ పెట్టారు. మరి ఇవన్నీ వదిలేసి చంద్రబాబు ప్రత్యేక హోదా డిమాండ్ చేస్తారని భావించలేం.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం...

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం రోజు అవ్వ తాతలకు పెన్షన్ల పండుగ...



ఎమ్మిగనూరు జూలై 1 విభారె న్యూస్...ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం 3000 రూపాయలు ఉన్న పెన్షన్ను 4000 రూపాయలు పెంచుతామని చెప్పిన మాట ప్రకారం మూడు నెలల బకాయిలతో కలిపి నేడు రాష్ట్రవ్యాప్తంగా 7000 రూపాయలు అవ్వ తాతలకు పెన్షన్లు ఇవ్వడం జరిగినది. సోమవారం రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 65,18,496 ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు కొరకు 4,408 కోట్ల రూపాయలు అవ్వ తాతలకు ఇవ్వడం జరిగినది. భారతదేశ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంత భారీ మొత్తంలో పెన్షన్లు ఇవ్వడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామినే నిలిచింది. 3వ వార్డు నందు ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి పాల్గొని, తన చేతుల మీదుగా అవ్వ తాతలకు పెన్షన్లు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి చేనేత మల్లికార్జున వార్డు కార్యకర్తలు శ్రీను, కృష్ణ, గడిగే నాగరాజు, రవి, భాష, తిమ్మరాజు, జోగి నాగరాజు, అజయ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 2వ తేదీ మంగళవారం కృత్తిక నక్షత్రం సందర్భంగా సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు..




కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 1 విభారె న్యూస్..02-07-2024 మంగళవారం కృత్తిక నక్షత్రం తో కూడి ఉన్నందున శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషమైన రోజు.కృత్తిక, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి జన్మ నక్షత్రం..ఈరోజు శ్రీ స్వామి వారికి విశేషంగా పూజలు, అభిషేకాలు, కావడి సేవ,హోమాలు జరుగుతాయి..దీర్ఘ కాలంగా సంతాన సమస్యలు, భూ సమస్యలు, ఆరోగ్య సమస్యలు, వివాహ సమస్యలు ఉన్నవారు ఈరోజు శ్రీ సుబ్రహ్మణ్య ఆరాధన ద్వారా స్వామి వారి కృప కు పాత్రులై అభీష్ట సిద్ధి పొందుతారు..కావడి సేవ శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత ప్రియమైనది..సాయంత్రం 5:30 గంటలకు శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణం జరుగుతుంది..కావున భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు..అభిషేకం - 200/-కావడిసేవ - 250/-మాసపూజ - 300/-సుబ్రహ్మణ్య హోమం - 3,500/-హోమ సంకల్పం - 116/-శ్రీ స్వామి వారి కళ్యాణం - 2,500/-కళ్యాణ సంకల్పం -516/-సంప్రదించండి :-శ్రీధర్ శర్మ -7995202082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777

## పేదలకు భరోసా కల్పించడమే సీఎం చంద్రబాబు ధ్యేయం

**పింఛన్లు పంపిణి లో వీర సింహారెడ్డి. రాకేష్ రెడ్డి**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - నిరుపేద, బడుగు వర్గాలకు భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయం అని గోస్పాడు మండల టిడిపి నాయకులు వీర సింహారెడ్డి. పట్టణ 16 వార్డు టిడిపి ఇంచార్జ్ రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు గ్రామంలో మరియు పట్టణంలో 16 వార్డు యందు వృద్దులు, వితంతు, దివ్యాంగులు, తదితర లబ్ధిదారులకు వీర సింహారెడ్డి. రాకేష్ రెడ్డి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణి చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పేదల ప్రభుత్వం ఏర్పడిందని, అన్ని వర్గాల అభివృద్దే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బిజెపి సంకిర్ణ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమాన దృష్టితో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరామకృష్ణుడు,చెన్నకేశవ, జనసేన నాయకుడు మిద్దె వెంకట సుబ్బయ్య, ముజాహిదీన్, కాశీమ్, మరియు జనసేన. టిడిపి నాయకులు,మరియు సచివాలయం సిబ్బంది తో కలిసి ఇంటి ఇంటికి వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసారు.







**- కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్.**

కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 1 విభారె న్యూస్..ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 76 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 76 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1)బెంగుళూరు స్టార్టప్ ఎస్ బి ఎన్ ఆర్ మార్కెటింగ్ మార్క్ కంపెనీ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారు 80 మంది నుండి డబ్బులు తీసుకుని మోసం చేశారని అనంతపురం,నంద్యాల, కదిరి,తిరుపతి , గుంటూరు, కర్నూలు జిల్లా ల కు చెందిన రఫీ, సుమన్ లు ఫిర్యాదు చేశారు. 2)ఎమ్మిగనూరు శాంతరాజు అనే వ్యక్తి తన పేరుతో నా ఇంటికి నకిలీ నోటిసులు పంపిస్తూ డబ్బులు ఇవ్వాలంటూ డిమాండు చేస్తున్నారని కర్నూలు కు చెందిన వెంకటేష్ ఫిర్యాదు చేశారు. 3)కర్నూలు సిరి గార్డెన్ - రియల్ ఎస్టేట్ పేరుతో 2 ప్లాట్లు ఇస్తామని 10 సంవత్సరాలు కంతుల పేరుతో డబ్బులు కట్టించుకుని మోసం చేశారని నంద్యాల కు చెందిన శ్రీలత ఫిర్యాదు చేశారు. 4) కుమారుడు ఇంటి ముందు ముళ్ళ కంచె వేసి రస్తా లేకుండా చేసి ఆస్తి ఇవ్వాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉల్చాల గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. 5)సెంట్రల్ గవర్నమెంట్ కంట్రాక్టులు ఇప్పిస్తానని కర్నూలు కు చెందిన వ్యక్తులు డబ్బులు తీసుకొని మోసం చేశారని బెంగుళూరు, హైదరాబాద్ లకు చెందిన హరిబాబు యాదవ్, కె. వి చౌదరి లు ఫిర్యాదు చేశారు. 6) ఎల్ ఎల్ సి కాలువ పై ఎద్దుల బండి రస్తా ఉన్నా కూడా ఎద్దుల బండి వెళ్ళనివ్వకుండా ఒక వ్యక్తి అడ్డుపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సి.బెళగల్ మండలం, బుర్రందొడ్డి గ్రామానికి చెందిన రాంబాబు ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో డిఎస్పీ జె. బాబు ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐ శివశంకర్ పాల్గొన్నారు.

## లబ్ధిదారుల కళ్ళలో ఆనందం

**- - - మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్**

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01-పింఛన్లు పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ల లో ఆనందం కనిపిస్తోందని మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన 6-7-10-12-36-37-38-వార్డులో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ అందజేసినారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందని ఆయన అన్నారు . 200 రూపాయలు ఉన్న పెన్షన్ వేయి రూపాయలు చేసిన ఘనత చంద్రబాబు గారికే దక్కిందన్నారు. అదేవిధంగా 1000/- రూపాయలు ఉన్న పెన్షన్ 2000/- చేసిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారని అన్నారు. గత ప్రభుత్వంలో 2000 ఉన్న పెన్షన్ ని 3000 పెంచుతూ ఐదు సంవత్సరాలు గడిపిన వైయస్ జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని ఏట 250/-రు పెంచుతూ ప్రజలను నమ్మకద్రోహం చేశారన్నారు. నేడు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాట ప్రకారం 3000/- రు పెన్షన్ ని 4000 పెంచుతూ అదేవిధంగా మూడు నెలల ముందే ప్రతి నెల 1000 రూపాయలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. మొత్తం కలిపి 7000 రూపాయలు నేడు పంపిణీ చేసామని అన్నారు. అలాగే నంద్యాలలో అన్ని వార్డులలో , అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు దగ్గరుండి లబ్ధిదారులకు పింఛన్ అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి. మాజీ మంత్రివర్యులు ఏరాసు ప్రతాప్ రెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, తులసి రెడ్డి మరియు ప్రభుత్వ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, టీడీపీ, బిజెపి, జనసేన, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు మహిళా సంఘాలు క్షేత్ర స్థాయిలో అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంతో, అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## పండగ వాతావరణం లో పింఛన్ల పంపిణీ

**---మంత్రులు ఎన్ ఎం డి ఫరూక్. బీసీ జనార్దన్ రెడ్డి**



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పెంచిన పింఛన్లను పండుగ వాతావరణంలో పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని 10వ వార్డులోని కల్పనా సెంటర్, బైరమల్ వీధి, ఫరూక్ నగర్ లలో తెల్లవారుజామున 6 గంటలకే ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు×ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమన్నారు. పింఛన్ పంపిణీ సమయంలో లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపించిందన్నారు. గతంలో 3000 రూపాయలు ఉన్న పింఛన్ల ని 4000 రూపాయలు పెంచడంతోపాటు ఏప్రిల్, మే, జూన్ మాసాలకు సంబంధించి మూడు నెలల బకాయిల అరియర్స్ తో కలిపి మొత్తం 7000 రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు మంత్రి వివరించారు. గత ప్రభుత్వంలో 2000 రూపాయలు ఉన్న పింఛన్ ని మూడు వేల రూపాయలు పెంచుతూ ఐదు సంవత్సరాలు కాలం గడిపారని... ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల ముందు చెప్పిన మాట ప్రకారం 3000 రూపాయలు పింఛన్ ని 4000 రూపాయలకు పెంచి పంపిణీ చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. నంద్యాల పట్టణంలోని అన్ని వార్డులు, గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు.రోడ్లు భవనములు, మౌలిక సదుపాయాల, పెట్టుబడుల శాఖ మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేట వీధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వితంతు, వృద్ధాప్య, వికలాంగుల వివిధ 11 కేటగిరీలకు చెందిన పింఛన్లను 3000 నుంచి 4000, కిడ్నీ మరియు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు 5000 నుంచి 10000 రూపాయలు, పక్షవాత వ్యాధిగ్రస్తులకు 5000 నుంచి 15000 వరకు వరకు పెంచుతూ మాట తప్పకుండా మెడ తిప్పకుండా పంపిణీ చేస్తున్నామన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం గతంలో 200 రూపాయలు ఉన్న పింఛన్లు 2000



రూపాయలు పెంచిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిదే అన్నారు. ప్రభుత్వంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే నేపథ్యంలో భాగంగా మెగా డీఎస్సీని నిర్వహించి 16, 385 పోస్టులను భర్తీ చేయనున్నట్లు మంత్రి వివరించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ కూడా రద్దు చేశామన్నారు. పేదవాడి ఆకలి తీర్చేందుకు రాయితీ ధరతొ గతంలో ఉన్న అన్న క్యాంటీన్లన్నిటిని పునరుద్ధరించే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తున్నామన్నారు. పేద ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చేసేందుకు ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నామని మంత్రి వివరించారు.

## జూలై 6వ తేదీ శనివారం నుండి 15 వ తేదీ సోమవారం వరకు సూర్య దేవాలయంలో వారాహీ నవరాత్రులు..

కర్నూలు జిల్లా ప్రతినిధి జూలై 1 విభారె న్యూస్...06.07.2024 శనివారం నుండి 15-07-2024 సోమవారం వరకు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహాగౌరీ అమ్మవారి (ఆషాఢ మాస)వారాహీ నవరాత్రులు (గుప్త నవరాత్రులు) జరుగును. ఈ వారాహీ అమ్మవారు శ్రీ లలితా మహాత్రిపుర సుందరి దేవి యొక్క సర్వ సైన్య అధ్యక్షురాలు. ఈ దేవిని వార్తాళి దండనాథ, పంచమి మొదలైన నామాలతో అర్చిస్తారు. ఈ వారాహీ అమ్మవారు శ్రీలలితా దేవి యొక్క ఆజ్ఞాచక్ర స్థానం నుండి ఆవిర్భవించినది. ఆషాఢ మాసంలో ఈ వారాహీ అమ్మవారి ఆరాధన వలన భక్తులకు గొప్ప రక్షణ శక్తి లభిస్తుంది. ఈమె యొక్క అనుష్ఠానం, అర్చన, హోమాల వలన జీవితంలో ఎదురైయ్యే సమస్త కష్ట, నష్టాలు శత్రు, రుణ, రోగ బాధలు, న్యాయసంబంధ, భూసంబంధ సమస్యలు తొలిగిపోతాయి. అమ్మవారు గొప్ప క్రియాశక్తి స్వరూపిణి కావున పాడి పంటలను సమృద్ధిగా అనుగ్రహిస్తుంది. ఈ అమ్మవారి అర్చన అనుష్ఠానము రాత్రి సమయములో చేయుట సంప్రదాయం శ్రీ విద్యా సంప్రదాయంలో అమ్మవారి, అర్చన అనుష్ఠానమునకు విశేష స్థానము ఇవ్వబడినది. కావున భక్తులు నవరాత్రులలో పాల్గొని అమ్మవారి అనుగ్రహమునకు పాత్రులు కాగలరు.ఈ తొమ్మిది రోజులు ఉదయం 9.30 గం లకు లలితా సహస్ర నామార్చన రాత్రి 6.30 నుండి 8.00 గం ల వరకు వారాహీ సహస్ర నామార్చన జరుగును. 9 రోజుల పూజకు- 300/- సంప్రదించవలసిన నెం డి.లక్ష్మీనరసింహ శర్మ.. 8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్. 8896123777.

## నల్లగట్ల లో పింఛన్ల పంపిణీ

**---టిడిపి నాయకులు అనుముల నాగరాజు**



----విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - జూలై 1 వ తేది రాష్ట్ర వ్యాప్తంగా మన ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు గారు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ల పెంపు,గడిచిన మూడు నెలలతో కలిపి 7000 రూపాయల పెన్షన్ అందజేత కార్యక్రమం నల్లగట్ల యందు పండుగ వాతావరణం గా జరిగిందని టిడిపి నాయకులు అనుముల నాగరాజు పేర్కొన్నారు. నాగరాజు మాట్లాడుతూ సోమవారం అర్లగడ్డ నియోజకవర్గం నల్లగట్ల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్దిదారులకు ఇంటింటికీ తిరిగి పింఛన్దారులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల నాగరాజు తో పాటు మదు. కిట్టయ్య. లక్ష్మిరెడ్డి. కుమ్మరి శంకరయ్య. అక్కల రాఘవేంద్ర. మస్తాన్. రాఘవేంద్ర కుమార్. చంద్రకాంతు. తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ తీసుకొని గంటకే మృతి---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 01 - నంద్యాల మండలం పుసులూరు గ్రామలో సోమవారం గుమ్మడి పెద్ద సుబ్బారాయుడు (75) వృద్దాప్య పింఛన్ తీసుకొని గంట తర్వాత మృతి చెందారు. గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ సతీష్ కుమార్ గుమ్మడి పెద్ద సుబ్బారాయుడు ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబు పెంచిన 7000 వేల రూపాయలు అందించి వచ్చారు, గంట తర్వాత కుటుంబ సభ్యులు పెద్ద సుబ్బారాయుడు మృతి చెందినట్లు సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190